## అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

### -ఏఎస్‌పి బొడ్డు హేమంత్



**టీ.మీడియా,జూలై4,చింతూరు:**అల్లూరి సీతారామరాజు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని చింతూరు ఏఎస్పి బొడ్డు హేమంత్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏఎస్పీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో తెల్ల దొరలకు కునుకు లేకుండా చేసి, గిరిజనుల,అడవి, భూమి, నీరు హక్కుల కోసం బ్రిటిష్ సామ్రాజ్య ధోరల మీద యుద్ధం నడిపిన వ్యక్తి, సమూహ శక్తి అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
TMEDIA
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 200
సంచిక : 300
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఆదివారం, జులై 05, 2026


# దుమ్ము ధూళిలో సత్తుపల్లి



### -ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రభావం

**టీ మీడియా, జులై 4,సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న జేవిఆర్ ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల తవ్వకాల కారణంగా దుమ్ము ధూళి తీవ్రంగా వ్యాపిస్తోందని, దీంతో సమీప గ్రామాల ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిష్టారం, చెరుకుపల్లి, రేజర్ల, సత్తుపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ కాలుష్య ప్రభావానికి గురవుతున్నట్లు చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, గనుల్లో ప్రతిరోజూ నిర్వహించే బ్లాస్టింగ్, డ్రిల్లింగ్, బొగ్గు రవాణా వల్ల భారీగా ధూళి గాలిలోకి ఎగసిపడుతోంది. ఈ ధూళి గాలి ద్వారా సమీప గ్రామాలకు చేరి ప్రజల ఆరోగ్యంతో పాటు వ్యవసాయ పంటలపైనా ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో గత కొన్నేళ్లుగా దగ్గు, శ్వాసకోశ సమస్యలు, ఉబ్బసం, కళ్ల మంట, చర్మ అలర్జీలు వంటి సమస్యలు పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. కొందరిలో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు కూడా గుర్తించబడినట్లు పేర్కొంటున్నారు. అయితే, ఈ వ్యాధులకు గనుల కాలుష్యమే ప్రత్యక్ష కారణమని నిర్ధారించేందుకు శాస్త్రీయ ఆరోగ్య, పర్యావరణ అధ్యయనాలు అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)తో పాటు పలు పరిశోధనల ప్రకారం, దీర్ఘకాలం గాలి కాలుష్యానికి గురికావడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని వెల్లడైంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు వంటి వర్గాలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. బొగ్గు గనుల వల్ల స్థానికులకు ఉపాధి, ప్రభుత్వానికి ఆదాయం, ప్రాంతీయ అభివృద్ధి వంటి ప్రయోజనాలు ఉన్నప్పటికీ, గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం, భూగర్భ జలాలపై ప్రభావం, ఇళ్లకు పగుళ్లు, వ్యవసాయ దిగుబడి తగ్గడం వంటి సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారించాలని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



**ప్రధాన డిమాండ్లు**

బ్లాస్టింగ్ సమయంలో నిరంతర నీటి స్ప్రింక్లింగ్ నిర్వహించాలి. దుమ్ము నియంత్రణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి. ప్రభావిత గ్రామాల చుట్టూ విస్తృతంగా హరితవనం అభివృద్ధి చేయాలి. గాలి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు వివరాలు వెల్లడించాలి. ఉచిత వైద్య శిబిరాలు, శాశ్వత ఆరోగ్య పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్‌కు సంబంధించిన ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి. సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనులు ప్రాంత అభివృద్ధికి దోహదపడుతున్నప్పటికీ, గాలి కాలుష్యంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి, ఆరోగ్య శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దుమ్ము నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు ప్రభావిత గ్రామాల్లో శాశ్వత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చురుగ్గా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

### -జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

### -ఫారాల పంపిణీ పూర్తి

**టీ మీడియా,జూలై 4, ఖమ్మం:** ఖమ్మం జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, చురుగ్గా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. కొత్త ఓటర్లను చేర్చడం, చనిపోయిన వారిని ఓటరు జాబితా నుండి తొలగించడం ఓటర్ల వ్యక్తిగత వివరాల్లో అవసరమైన సవరణలు చేపట్టడం ఈ ప్రక్రియ లో చేస్తారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. పంపిణీ చేసిన ఫారాలను పూర్తి చేసి, తిరిగి స్వీకరించే ప్రక్రియ ప్రస్తుతం వేగంగా కొనసాగుతోందన్నారు. అర్హులైన వారందరూ తమ వివరాలను సకాలంలో అందించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో 1460 మంది బూత్ లెవల్ అధికారులు ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమంలో నిమగ్నమై పనిచేస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 98.82 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేసినట్లు, ఇప్పటివరకు 11.85 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. స్వీకరించిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ అన్నారు. దీనివల్ల ఓటర్ల జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందుతుందని తెలిపారు. ఓటర్లకు సహకరించడానికి మునిసిపల్, మండల కేంద్రాల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ అన్నారు. సహాయక కేంద్రాల బాధ్యులు ప్రజల సందేహాలు తీర్చడంతోపాటు, ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో సహకరిస్తారని తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని కలెక్టర్ అన్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు లోబడి, పారదర్శకంగా జరుగుతున్న ప్రక్రియ అని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో జిల్లా యంత్రాంగం పనిచేస్తున్నట్లు



అన్నారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



## భారీ గంజాయి పట్టివేత

### ప్రధాన నిందితుడు అరెస్ట్

**టీ మీడియా, జులై 4,సత్తుపల్లి:** ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సత్తుపల్లి పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి ఆధ్వర్యంలో ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ఈగల్ టీమ్, పోలీస్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 166 కిలోల 360 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.89.13 లక్షలుగా పోలీసులు అంచనా వేశారు. ఈ కేసులో ప్రబీన్ బాత్రా అనే వ్యక్తిని ప్రధాన నిందితుడిగా అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఒక టయోటా ఎటియోస్ కారు, ఒక సెల్‌ఫోన్, రూ.500 నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులను కేసులో చేర్చి వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా

3లో

# సాంద్రత పద్ధతి సాగు తో పత్తి అధిక దిగుబడి

**వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి**

**టీ మీడియా ,జులై 4 ,పాలేరు:**అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తే పత్తి అధిక దిగుబడి సాధించ వచ్చని కూసుమంచి మండల వ్యవసాయ అధికారిని రామడుగు వాణి పేర్కొన్నారు. కూసుమంచి మండలంలోని జీళ్ళచెరువు గ్రామంలో శనివారం కిసాన్ కపాస్ పథకం ద్వారా 100 శాతం రాయితీతో ( ఉచితంగా ) రైతులకు పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూప్రభుత్వం 2026--27 నుండి 2030--31 వరకు మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటీ (కిసాన్ కపాస్ ప్రవేశపెట్టిన పథకం ద్వారా పత్తి దిగుబడి, నాణ్యత తో రైతుల ఆదాయాన్ని పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.అధిక సాంద్రత సాగు విధానం దగ్గర సాలు పద్ధతుల ద్వారా పత్తి ఉత్పాదకతను పెంచాలనే లక్ష్యంతో రైతులకు పత్తి విత్తనాలను పూర్తి సబ్సిడీతో అందిస్తున్నట్లు ఆమె చెప్పారు.అధిక సాంద్రత పత్తి పద్ధతిలో ఎకరాకు ఆరు ప్యాకెట్లు, దగ్గర సాలు పత్తి పద్ధతిలో ఎకరాకు నాలుగు ప్యాకెట్లు, సమగ్ర పంట యాజమాన్యం పద్ధతిలో ఎకరాకు రెండు ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు.అధిక సాంద్రత పత్తిలో ఒక ఎకరాకు సుమారు 90 ఐ 15 సెం.మీ. దూరంలో నాటితే సుమారు 23,700 మొక్కలు, దగ్గర సాలు పద్ధతిలో 90 ఐ 30 సెం.మీ. దూరంలో నాటితే సుమారు 11,850 మొక్కలు, సాధారణ పద్ధతిలో 90 ఐ 60 సెం.మీ. దూరంలో నాటితే సుమారు 5,925 మొక్కలు ఉంటాయనీ,ఈ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, తక్కువ సమయంలో ( 5 నెలలకాలంలో, ) పంట సాగు పూర్తయి,80% పత్తి ఒకేసారి దిగుబడి వస్తుందని ఆమె తెలిపారు. ప్రస్తుత




వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ఈ విధానం మేలని ,ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని ఆమె చెప్పారు., ఒక రైతుకు గరిష్టంగా 2.5 ఎకరాల వరకు మాత్రమే ఉచితంగా పత్తి విత్తనాలు అందజేస్తామని వాణి అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్ ,రైతులు, పాల్గొన్నారు.



## మైనార్టీ గురుకుల విద్యార్థిని అదృశ్యం కలకలం

**పోలీసుల గాలింపుతో సురక్షితంగా గుర్తింపు**

**టీ మీడియా,జులై 4,సింగరేణి(కారేపల్లి):**కారేపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థినిని తాను బాలిక పిన్నినని చెప్పిన ఓ మహిళ బయటకు తీసుకెళ్లి,అనంతరం ఇద్దరూ కనిపించకుండా పోవడంతో శుక్రవారం సాయంత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పోలీసుల గాలింపు చర్యల అనంతరం విద్యార్థిని సురక్షితంగా గుర్తించినట్లు గురుకుల ప్రిన్సిపాల్ తెలిపారు.ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం,ఓ మహిళ తాను విద్యార్థిని పిన్నినని చెప్పి,బాలిక తల్లితో ఫోన్‌లో మాట్లాడించిన అనంతరం పర్మిషన్ లేఖ రాసి విద్యార్థినిని బయటకు తీసుకెళ్లింది.సంబంధిత ఉపాధ్యాయుడి వద్ద అనుమతి తీసుకుని వెళ్లినప్పటికీ,చాలాసేపటి వరకు విద్యార్థినిని తిరిగి తీసుకురాకపోవడంతో గురుకుల సిబ్బంది అప్రమత్తమయ్యారు.బాలికను తీసుకెళ్లిన మహిళకు పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో వెంటనే ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించి,అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టి విద్యార్థినిని గుర్తించారు.ఈ ఘటనపై శుక్రవారం గురుకుల విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు.తల్లిదండ్రులు ,అధికారికంగా గుర్తింపు పొందిన సంరక్షకులు స్వయంగా వచ్చినప్పుడే విద్యార్థులను పంపించాలనే నిబంధన ఉన్నప్పటికీ,సరైన ధృవీకరణ లేకుండా విద్యార్థినిని బయటకు పంపడంపై అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి వివరాలను నిర్ధారించకుండా,గుర్తింపు పత్రాలను పరిశీలించకుండా విద్యార్థినిని పంపించడం తీవ్రమైన నిర్లక్ష్యమని పేర్కొన్న విజిలెన్స్ అధికారులు,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కచ్చితమైన భద్రతా చర్యలు అమలు చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.




## ఎర్రబోడు పాఠశాల విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

**ఖమ్మం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో**

**రూ.15 వేల విలువైన సామగ్రి అందజేత**

**టీ మీడియా,జులై 4,సింగరేణి(కారేపల్లి):**కారేపల్లి మండలం ఎర్రబోడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఖమ్మం యూత్ అసోసియేషన్ (కేవైఏ) ఆధ్వర్యంలో శనివారం స్కూల్ కిట్లను పంపిణీ చేశారు.కేవైఏ వ్యవస్థాపకుడు శ్రీ తేజ ఆధ్వర్యంలో సభ్యులు శ్రీకాంత్,రాహుల్,దేవ్ సింగ్,ప్రవీణ్‌లు కలిసి సుమారు రూ.15 వేల విలువైన స్కూల్ కిట్లను అందజేశారు.ప్రతి కిట్‌లో స్కూల్ బ్యాగ్,ఎగ్జామ్ ప్యాడ్,ప్లేట్,నోట్‌బుక్స్,పెన్నులు,పెన్సిల్ బాక్స్,స్కేల్,వాటర్ బాటిల్ తదితర విద్యా సామగ్రి ఉన్నాయి.ఈ కిట్లను తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు,సర్పంచ్ ఈసాల అలివేలు,ఉపసర్పంచ్ కడియాల రమాదేవి,ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు,సొసైటీ మాజీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు,వ్యాపారవేత్త తుళ్లూరి వెంకటేశ్వర్లు (పెద్దబాబు)విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమని,ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందిస్తాయని అన్నారు.సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. చంద్రశేఖర్,ఉపాధ్యాయురాలు టీ.రమాదేవి,పాఠశాల చైర్‌పర్సన్ కనికరపు పద్మ, గ్రామ పెద్దలు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ.



**టీ.మీడియా,జూలై 4,చింతూరు:**చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రమేష్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా సామగ్రిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి నూరు ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.




## పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా వాటర్ ప్యూరిఫైయర్ విరాళం

**రూ.8 వేల విలువైన వాటర్ ప్యూరిఫైయర్ అందజేత**

**టీ మీడియా,జులై04,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండలం పాటిమీదిగుంపు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామానికి చెందిన గూగులోత్ అనిల్ కుంబ్లే రూ.8,000 విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పాఠశాలలో చదువుతున్న చిన్నారులు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో పొందాలని,ఫ్లోరైడ్ ప్రభావం నుంచి పిల్లలను కాపాడాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు ఈ వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేసినట్లు తెలిపారు.పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమాజంలోని దాతలు కూడా విద్యాసంస్థలకు తమ వంతు సహాయం అందించాలని కోరారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ ...విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరమని,దాత గూగులోత్ అనిల్ కుంబ్లేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లకు నోటీసులు జారీ

**టిమీడియా, జూలై4, కురవి:**తెలంగాణ ప్రభుత్వం - పౌర సరఫరాలు సంస్థ, శాఖ ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమం మిషన్ ఖ-100 కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని కురవి, మహబూబాబాద్ మండలాలలోని రైస్ మిల్లులను తనిఖీ చేశారు.శనివారం కురవి మండలం అయ్యగారిపల్లి శ్రీ తిరుమల రైస్ ఇండస్ట్రీస్, మహబూబాబాద్ మండలం అనంతారం గ్రామంలోని శ్రీనివాస ఇండస్ట్రీస్, రైస్ మిల్లులను తనిఖీ చేసి వారు చెల్లించాల్సిన పద్దెనిమిది కోట్ల ఇరవై ఏడు లక్షలు 18.27 కోట్లు.లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా రబీ 2022-23 వేలం ధాన్యం ఖర్చులను మిల్లర్ల నుండి రావలిసిన మొత్తం సుమారు 90 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రబీ 2022-23 వేలం ధాన్యం ఖర్చులను మిల్లర్ల నుండి ఏడూ కోట్ల రూపాయలను వసూలు చేసిందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాలు అధికారి జే రమేష్, జిల్లా సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మేనేజర్ వి నరసింహ రావు, కురవి మండల ఎం.ఆర్.ఓ విజయ, మహబూబాబాద్ మండల రెవిన్యూ అధికారి రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.






## డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి

**టీ.మీడియా,జూలై4,చింతూరు:** చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం ఆదేశానుసారం నిర్వహించడం జరిగింది. కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ముల్లి. శేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న విశాఖపట్నం జిల్లాలోని పాండ్రంకి గ్రామంలో 1897 జులై 4వ తేదీన క్షత్రియ కుటుంబంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని గిరిజన ప్రజల అభివృద్ధికి కృషిచేసి ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఎదుర్కొన్న గొప్ప స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజుని తెలిపారు. రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు మాట్లాడుతూ అతి చిన్న వయసులో అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారిని ఎదిరించారు అని తెలిపారు. చరిత్ర విభాగాధిపతి బి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అతి చిన్న వయస్సులోనే బ్రిటిష్ వారితో పోరాటానికి సిద్ధపడి తన ప్రాణాలను బలిదానం చేసిన సమరయోధుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్.వై. పద్మ, డాక్టర్. శకుంతల, ఎస్.అప్పనమ్మ, కే. శైలజ, జి.హారతి, ఎం. నాగమోహన్ రావు, ఎన్.ఆనంద్, కే. లక్ష్మీ ప్రసన్నకుమారి, కే.కీర్తి, ఆర్. మౌనిక, ఆర్. కిరణ్మయి తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## రోశయ్య సేవలు చిరస్మరణీయం

**నేటి తరానికి ఆదర్శప్రాయుడు**

**టీ మీడియా,జులై04,సింగరేణి(కారేపల్లి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పరిపాలనా దక్షుడు స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఖమ్మం జిల్లా సింగరేణి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళు లర్పించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించిన అధికారులు,సిబ్బంది ఆయన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో.పద్మ ఎంపీఓ మల్లెల. రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం,ఆర్థిక క్రమశిక్షణ,పారదర్శక పరిపాలనకు కొణిజేటి రోశయ్య విశేష ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కోటేశ్వరరావు,మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది,కంప్యూటర్ ఆపరేటర్లు, ఈజీఎస్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.



## హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన దమ్మపేట బార్ అసోసియేషన్

**టీ మీడియా, జులై 4,దమ్మపేట:**శనివారం దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీమోహన్ అధ్యక్షతన కొత్తగూడెం జిల్లా కోర్ట్ కి వచ్చిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె శ్రీనివాస్ రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలను హై కోర్ట్ న్యాయమూర్తి కి వివరించారు. దమ్మపేటకు నూతనంగా సబ్ కోర్టు మంజూరు చేయాలని, దమ్మపేట కోర్టులో సిబ్బంది చాలా తక్కువగా ఉండటం వల్ల ఇబ్బంది కలుగుతుందని త్వరగా కోర్టు సిబ్బందిని నియమించాలని కోరారు. దమ్మపేట కోర్టులో న్యాయదేవత విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు అనుమతి ఇవ్వవలసిందిగా వినతి పత్రం అందించారు. ఈ సమస్యలపై న్యాయమూర్తి జే శ్రీనివాస్ రావు సానుకూలంగా స్పందించారని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లక్కినేని నరేంద్రబాబు, ట్రెజరర్ తామ బాలరాజు, స్పోర్ట్స్ సెక్రటరీ తిర్నాటి సంజయ్, ఆర్గనైజషన్ సెక్రటరీ నల్లపు ఉదయ్ కుమార్, ఈసీ మెంబర్ 2 గద్దల అప్పారావు, మహిళ న్యాయవాది కాలం సంధ్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

## పాటలతో నాగన్న ప్రజా చైతన్యం : న్యూ డెమోక్రసీ



**టీ మీడియా, జులై 4, పాలేరు:**పల్లె ప్రజల జానపద యాసలో ( ధోరణి లో ) సామాజిక, విప్లవపంద పాటలతో అన్ని వర్గాల ప్రజలని ఉర్రూతలూగించిన ప్రజా పోరాట గాయకులు అరుణోదయ నాగన్న అని సి పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలని,బూర్జువ, ప్రజా దోపిడి, పెట్టుబడి వర్గాలని హెచ్చరిస్తూ, ప్రజల పక్షాన నిలబడి, సమస్యలను తమ గేయాల ఆలాపనతో, అన్ని వర్గాల ప్రజలని నాగన్న ఆలోచింప చేశారన్నారు.న్యూ డెమోక్రసీ పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి, నాయకులు నాగన్న మృతి పట్ల సంతాపం తెలిపి, వారు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రామిక వర్గ ప్రజల కోసం తన పాటల ద్వారా అవిశ్రాంత పోరాటం చేసిన,ప్రజా గాన కోకిల అరుణోదయ నాగన్న అని కొనియాడారు. అరుణోదయ నాగన్న మృతి అన్ని వర్గాల ప్రజానీకానికి, ప్రత్యేకించి కళాకారులకి తీరని లోటని వారు పేర్కొన్నారు. చిన్ననాటి నుండి జీవితమంతా ప్రజా పోరాటాలకి అంకితం చేసిన అరుణోదయ నాగన్న స్ఫూర్తితో, నేటి యువత ,కళాకారులు ప్రజా పోరాటాల లో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న, పి వై ఎల్ కార్యదర్శి. గొర్రె పాటి రమేష్, అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, పి ఓ డబ్ల్యు నాయకురాలు పుష్పక్క రామన్న కుమారులు, నాగన్న మృతి పట్ల సంతాపం తెలిపి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ప్రజా పోరాట విప్లవ గాయకులు అరుణోదయ నాగన్న మృతి పట్ల టి పి టి ఎఫ్ కూసుమంచి మండల శాఖ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు బత్తుల ఉప్పయ్య చాపల సత్యనారాయణ రామయ్య వెంకన్న రవి తదితరులు సంతాపం తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యకు గౌరవ డాక్టరేట్



**టీ మీడియా, జులై 4,కరకగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం చిరుమళ్ల గ్రామానికి చెందిన చందా లింగయ్యకు అరుదైన గౌరవం లభించింది. చందా లింగయ్య ఉమ్మడి ఖమ్మం జిల్లా బూర్గంపహాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా, ఖమ్మం జిల్లా జడ్పీ చైర్మన్ గా సేవలందించినందుకు గాను అలాగే ఆదివాసీ జాతి హక్కుల సాధనకు కృషి, సుదీర్ఘకాలం పాటు ఆదివాసీ ప్రాంతానికి సేవలందించినందుకు గానూ తమిళనాడు రాష్ట్రంలోని పుదుచ్చేరిలో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ అంతర్జాతీయ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మారుమూల గిరిజన ప్రాంతం నుండి గిరిజనుల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన చందా లింగయ్యకు ఈ అవార్డు రావడం పట్ల మండలంలోని ఆదివాసీ సంఘాల నాయకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# సమర్థవంతంగా ప్రాధాన్యత కార్యక్రమాలు అమలు

### -జిల్లా కలెక్టర్ అంకిత్




**టీ మీడియా, జులై 4,పాల్వంచ :** జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, వనమహోత్సవం, సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుధ్య నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తుల పంపిణీతో పాటు ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై శనివారం సంబంధిత శాఖల అధికారులతో ఐడిఓసి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.వనమహోత్సవం కార్యక్రమంపై కలెక్టర్, జిల్లాలో శాఖలవారీగా నాటిన మొక్కల సంఖ్య, సాధించిన లక్ష్యాలు, పెండింగ్ లక్ష్యాలు, మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా కార్యాచరణను వేగవంతం చేయాలని, నాటిన ప్రతి మొక్క జీవించేలా నీటి వసతి, ట్రీ గార్డులు, క్రమం తప్పకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొక్కల నాటకం లక్ష్యాల సాధనతో పాటు వాటి మనుగడకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయడంతో పాటు నిల్వ నీరు లేకుండా చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు యాంటీ లార్వా కార్యక్రమాలు, ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచి, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్తను సకాలంలో తొలగించడం, కాలువలను శుభ్రపరచడం, పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందుతున్న తీరు, వంటశాలల పరిశుభ్రత, పాఠశాలల పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, బోధన ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను అర్హులైన ప్రతి విద్యార్థికి సకాలంలో పంపిణీ చేసి, పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యా చందన , జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి , జిల్లా పంచాయతీ అధికారి అనూష, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీరాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు, మిషన్ భగీరథ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## భద్రతా నిబంధనల్లో రాజీపడొద్దు

### -భూగర్భ గనుల జీఎం కె.యాదయ్య



**టీ మీడియా, జులై 4,రుద్రంపూర్:** కొత్తగూడెం ఏరియాలోని పీవీకే నెం.5 ఇంక్లైన్ భూగర్భ గనిని సింగరేణి భూగర్భ గనుల జనరల్ మేనేజర్ కె. యాదయ్య శనివారం సందర్శించారు. గనిలో జరుగుతున్న ఉత్పత్తి, ఉత్పాదకత, భద్రతా ప్రమాణాలు, నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సమగ్ర తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా గనిలోని వివిధ పని స్థలాలను పరిశీలించిన జీఎం, భద్రతా నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను నాణ్యతతో, సమయ పాలనతో పూర్తి చేయడంతో పాటు ఉత్పాదకతను మరింత పెంచేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడం ప్రతి అధికారి బాధ్యత అని స్పష్టం చేశారు.అనంతరం గని నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, యంత్రాల పనితీరు, ఉత్పత్తి పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, పనుల్లో నాణ్యత, సామర్థ్యం పెంపునకు అవసరమైన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ. టు జీఎం ఎం.గోవిందరావు, ఏరియా ఇంజినీర్ వి.రామకృష్ణ, పీవీకే నెం.5 ఇంక్లైన్ ఏజెంట్ రామ్ భరోస్ మెహతో, గ్రూప్ ఇంజినీర్ గోదావరి శ్రీనివాసరావు, మేనేజర్ పి.రవికిరణ్, సేఫ్టీ ఆఫీసర్ అనిల్ సాగర్, పిట్ ఇంజినీర్ శ్రీనివాస్, ఇంజినీర్ (ఈఎం) బి.శివరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

### -ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి(సీడీపీవో) కేఎం తార



**టీ మీడియా, జులై 4,బూర్గంపహాడ్ :** బూర్గంపహాడ్ మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి(సీడీపీవో) కేఎం తార శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సంబంధించి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నుండి నోటిఫికేషన్ జారీచేయడం జరిగిందని, మండలంలో 10 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ పోస్టుకు స్థానికంగా ఉన్న మహిళలు అర్హులని, ఇంటర్, 10o2 పాసై ఉండాలని, 1.07.2026 నాటికి 18 ఏళ్లు నిండి 35 ఏళ్లకు మించకుండా ఉండాలని పేర్కొన్నారు.



## ఈరికి నివాళులర్పించిన మండల విద్యాధికారి జయరాజు

**టీ మీడియా,జులై04,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామపంచాయతీ భిక్య తండాకు చెందిన మండల మాజీ ప్రధాన కార్యదర్శి,సీనియర్ జర్నలిస్టు అజ్మీర వీరన్న తల్లి అజ్మీర ఈరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి దుగ్గిరాల జయరాజు మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం అజ్మీర ఈరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అలాగే వీరన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది మోతిలాల్,విజయ్,రాము,నాయకులు రామ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ గంజాయి పట్టివేత

గంజాయిని తరలిస్తుండగా, సత్తుపల్లి పట్టణంలోని ఒక హోటల్ సమీపంలో వాహనాల తనిఖీల సందర్భంగా నిందితుడు పోలీసులకు చిక్కాడు.స్వాధీనం చేసుకున్న గంజాయిని 80 ప్యాకెట్లలో తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై క్రైం నెం. 290/2026గా ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. విచారణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.